క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి

కమలాపూర్ : మండలంలో నిర్మించిన 450 డబుల్ బెడ్రూంల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తొటం ఝాన్సీరాణిరవీందర్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూముల దురాక్రమణ, మండలంలోని గుండేడు, పంగిడిపల్లి గ్రామాల్లో అక్రమ మైనింగ్ దందా, పలు వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యక్తికి 9రోజుల రిమాండ్

శాయంపేట : నాన్‌బేలబుల్ వారెంట్ పడిన ఓ వ్యక్తి సరిగా కోర్టుకు హాజరుకాకపోవడంతో సోమవారం పరకాల జ్యూడిషల్ మెజిస్ట్రేట్ శాలిని లింగం 9రోజులు రిమాండ్ విధించినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన మాందాటి తిరుపతి క్రిమినల్ కేసులో నాన్‌బేలబుల్ వారెంట్ కాగా అతడు కోర్టుకు సరిగా హాజరు కాలేదని తెలిపారు. దీంతో సోమవారం పరకాల కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీంతో జ్యూడిషల్ మెజిస్ట్రేట్ శాలిని లింగం అతడికి 9రోజులు రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు పంపించినట్లు ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి బాల్యమిత్రుల సాయం



దామెర : తోటి మిత్రుడు మరణించడంతో బాల్యమిత్రులంతా ఒక్కటై బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన సుదమల్ల శ్రీపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా ఆయనతో పాటు 1994–95 పదోతరగతి చదివిన బాల్యమిత్రులందరూ ఏకమై శ్రీపాల్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. అనంతరం రూ.66,000 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మోహన్, శివకుమార్, ప్రమోద్‌రెడ్డి, కుమారస్వామి, ఉమారాణి, రమాదేవి, రాజేశ్వరి, రజిత, రాధిక, రవి, సంతోశ్, రమణాచారి, శ్రీనివాస్, రాజు, అశోక్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీలో రేషన్ డీలర్ నిర్లక్ష్యం



దామెర : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీలో మండలంలోని కోగిల్వాయి రేషన్ డీలర్ గౌస్‌పాషా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బియ్యం పంపిణీ చేయడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రేషన్ షాపు ఉదయం, సాయంత్రం తాళం వేసి ఉండటంతో లబ్ధిదారులు వెనుదిరిగి వెళ్తున్నారని, చుట్టుపక్కల గ్రామాలైన సింగరాజుపల్లి, వెంకటాపూర్, ల్యాదళ్లకు వెళ్లి సన్నబియ్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. గతంలో సరుకుల పంపిణీలో కూడా సదరు డీలర్ నిర్లక్ష్యంగా వ్యవహరించగా అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకుని సక్రమంగా సేవలందించే వారికి రేషన్ షాపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కొలంబో మెడికోస్



ఎల్కతుర్తి : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీని ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ మెడికోస్ సోమవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న వైద్యసేవలు, మందులు, ఇతర సదుపాయాల గురించి వైద్యాధికారులు డాక్టర్ రహమాన్, డాక్టర్ రుబీనాను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను సందర్శించి వాటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఫాదర్ తరుణ్‌రెడ్డి, నజీరియా, డాక్టర్ మధుసుదన్, బాలు, గీతాంజలి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

కాజీపేట: రెండున్నర దశాబ్దాలుగా వైఎస్సార్ నగర్ కాలనీలో గుడిసెలు వేసుకుని దుర్భర పరిస్థితులలో జీవిస్తున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ పథకం కింద గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు.

యాసంగి వరికోతలు షురూ..



వరిని కోస్తున్న హార్వెస్టర్



ధాన్యాన్ని నేర్పుతున్న రైతు

- మండల వ్యాప్తంగా 22,770 ఎకరాల్లో సాగు
- హార్వెస్టర్లకు భలే గిరాకీ
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్



కోసిన ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

ఎల్కతుర్తి : మండలంలో యాసంగి వరికోతలు ప్రారంభమయ్యాయి. యాసంగి ఆరంభంలో దుక్కులు దున్ని నారుపెంచి కూలీల సాయంతో వరిసాగు చేసిన రైతులు చీడపీడల బెడదను తట్టుకుని పంటసాగు చేస్తే చేతికందింది. దీంతో రైతులు హార్వేస్టర్ యంత్రాలతో కోతలు ప్రారంభించారు.

15,253 ఎకరాల్లో మేల్, ఫీమేల్ సాగు

మండల వ్యాప్తంగా 22,770 ఎకరాలు భూ విస్తీర్ణం ఉంది. అందులో 15,253 ఎకరాలు మేల్, ఫిమేల్ వరిని రైతులు సాగుచేశారు. మిగతా 7వేల ఏకరాల్లో సాధారణ రకాల వరిని సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మేల్, ఫిమేల్ వరి సైతం కోతదశకు చేరుకుంది. మరో పదిరోజుల్లో వరికోతలు మండల వ్యాప్తంగా జోరందుకోనున్నాయి. కాగా మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన వరిపంట ఆరంభంలోనే మండుతున్న ఎండల వలన భూగర్భ జలాలు అడుగంటి పోయి వ్యవసాయ బావుల్లో నీరు లేకపోవడంతో సాగు చేసిన వరిపంట ఎండిపోయింది. అలాగే ఆయకట్టు చివరి వరకు దేవాదుల నీరు వదలకపోవడంతో పలు గ్రామాల్లో వరిపంట ఎండిపోయింది. దీంతో రైతులు చేసేది ఏమిలేక పశువులను పంటచేనులో వదిలిపెట్టడంతో వరిపంట పశువులకు మేతగా మరిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా ఎస్సారెస్పీ ఆయకట్టు కింద ఉన్న 13 గ్రామాల్లో సాగు చేసిన వరిపంట మరో వారం రోజుల్లో చేతికందనుంది. ప్రభుత్వం గత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరికోతలు ప్రారంభం కాకముందే 15రోజుల ముందుగానే ఏర్పాటు చేసింది. ఈ యాసంగిలో మాత్రం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



రైతులు వరికోతలు ప్రారంభించి ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. మండల కేంద్రంలో కోతుల బెడుద అధికంగా ఉంది. ఆరబెట్టిన ధాన్యం వద్దకు గుంపులుగా వచ్చి ధాన్యాన్ని చిందరవందర చేస్తున్నాయి. వాతావరణంలో రోజురోజుకు చోటుచేసుకుంటున్న మార్పుల వలన వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– అల్లకొండ రాజు, రైతు, ఎల్కతుర్తి

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పరకాల : మాట్లాడుతున్న రమేశ్



శాయంపేట : పాదయాత్ర చేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి

శాయంపేట : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని కాట్రపల్లి, సాధనపల్లి, రాజుపల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించుకుందామని ఏఐసీసీ ఆదేశాల మేరకు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని అనుసరించి అన్నిరంగాల్లో రిజర్వేషన్ల ప్రకారం బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ ఫలాలు, అవకాశాలు అందించారని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పి క్రమంగా రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. నాయకులు చల్లా చక్రపాణి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రవి, కృష్ణమూర్తి, కుమారస్వామి, జగన్, సతీశ్, భాస్కర్, కమలాకర్ పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి మండల ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కొలిపాక సతీశ్ మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర పన్నుతుందని ఆరోపించారు. మండల అధ్యక్షుడు ఐలయ్య, ప్రోగ్రాం కో ఆర్డీనేటర్ రవీందర్, నాయకులు రాజు, వరుణ్, కిశోర్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : రాజ్యాంగ పరిరక్షణకు పోరాడాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. మండలంలోని తిరుమలగిరిలో సోమవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర పన్నుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సునంద, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, జిల్లా నాయకులు డాక్టర్ రామకష్ణ, రణధీర్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఖాజా, అలువాల రవి, జైపాల్‌రెడ్డి, కుమార్, రాజు, రజనీకర్ పాల్గొన్నారు.

పాల వ్యాన్ల బిల్లులు చెల్లించండి



హన్మకొండ చౌరస్తా: పెండింగ్‌లో ఉన్న పాల రవాణా వ్యాన్ల బిల్లులను చెల్లించాలని ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్ట్ వాహనాల యజమానులు కోరారు. విజయ డెయిరీ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన పాలను డెయిరీకి, డెయిరీ నుంచి పాల ప్యాకెట్లను దుకాణాలకు చేరవేసే తమ వాహనాలను అకారణంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జనగామ, పాలకుర్తి, మహబూబాబాద్, ఏటూరునాగారం రూట్లకు చెందిన పీటీసీ వాహన యజమానులు ఉన్నారు.

భూ బాధితులకు ఉద్యోగాలివ్వాలి



కాజీపేట రూరల్: కాజీపేట మండలం మడికొండ – అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్‌షెడ్ నిర్మాణంతో భూములు కోల్పోయిన వారికి అందులో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భూ బాధితులు కోరారు. ఈమేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను హనుమకొండలోని స్వగృహంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉల్లెంగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల : ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలకు, నాయకులకు సోమవారం పిలుపునిచ్చారు. పరకాల పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. రజతోత్సవ సభ అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ప్రారంభం కానుందని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలన్ని బోగస్ అని తేలిపోయిందన్నారు. ప్రజలు కూడా కాంగ్రెస్ బోగస్ హామీలు నమ్మి మోసపోయామని గ్రహించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతకు భయపడే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు విజయపాల్‌రెడ్డి, సారంగపాణి, సత్యనారాయణ, ప్రకాశ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నవీన్, మొగిలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

సిటీ పోలీస్ యాక్టు–30ని వెనక్కి తీసుకోవాలి

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్‌పై కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను అడ్డుకునేందుకే నెల రోజుల పాటు సిటీ పోలీస్ యాక్టు–03ని అమలు చేసిందని, వెంటనే వెనక్కి తీసుకోవాలని భీమదేవపల్లి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మండల సురేందర్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ప్రశ్నించే వారి గొంతు నొక్కుతోందని ఆరోపించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కోరారు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బక్క దానయ్య, అసోసియేషన్ ప్రతినిధులు ఉపేందర్, రౌతు రమేష్ కుమార్, కృష్ణ, గోపి, రాజేందర్, రవి, చలపతి పాల్గొన్నారు.

సమస్యలను విస్మరిస్తున్న అధికారులు

హన్మకొండ చౌరస్తా: ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి ఆరోపించారు. పార్టీ నార్త్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా సమస్యల అధ్యయన యాత్రను 5వ డివిజన్‌లోని దాసరివాడలో సోమవారం నిర్వహించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న నారాయణ

కేయూ క్యాంపస్: రక్తదానం మరొకరికి ప్రాణదానం లాంటిదని కేయూ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, హెల్త్ క్లబ్స్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సీతారాములు, గన్‌సింగ్, సంధ్యారాణి, శ్రీనివాస్, ఎన్‌సీసీ ఆఫీసర్ రమేష్, కేర్ టేకర్ ప్రసూన, హెల్త్ క్లబ్ కన్వీనర్ రోహిణి పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ రక్తదానం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంజీఎం రక్తనిధి సేకరణ కేంద్రాలు సంయుక్తంగా చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు.

ఆదివాసీలపై దాడులను నిలిపివేయాలి



వరంగల్ చౌరస్తా: మధ్య భారతదేశంలో ఆదివాసులపై ప్రధాని మోదీ ప్రభుత్వం చేస్తున్న దాడులు, హత్యకాండను తక్షణమే నిలిపివేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సీపీఐ (ఎంఎల్), అఖిల భారత రైతు – కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), ఆలిండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకేఎంకేఎస్) ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, అడవీ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు అప్ప చెప్పే ప్రయత్నాలను కేంద్రం ఉపసంహరించుకోవాలని సూచించారు. ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, దోషులను శిక్షించాలని కోరారు. ఐలయ్య, సుమన్, రాజేందర్, మొగిలి, శీను, కనకయ్య, శీను, కనకయ్య పాల్గొన్నారు.

కొలతల ప్రకారం 'ఉపాధి' పనులు చేయాలి

- ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : ఉపాధి హామీ కూలీలు ప్రతి రోజు రూ.307 కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెం రాములకుంటలో ఉపాధి హామీ పథకం కింద మత్స్యకారుల కోసం నూతనంగా నిర్మిస్తున్న చేపల చెరువును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట కూలి రోజుకు రూ.307 పొందడం ద్వారా ఆ కుటుంబానికి వంద రోజులకు గాను రూ.30,700 సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల వద్ద తప్పనిసరిగా నీడ, మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మర్రిపల్లిగూడెంలో పని ప్రదేశం వద్ద నీడ, మంచినీటి సౌకర్యం కల్పించిన పంచాయతీ కార్యదర్శి శరత్‌ను ఎంపీడీఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శి శరత్, ఈజీఎస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గుండె బాబు

ఐజేయూతోనే జర్నలిస్టు సమస్యల పరిష్కారం

- జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి

శాయంపేట / పరకాల : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘంతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అన్నారు. శాయంపేట మండల కేంద్రంతో పాటు పరకాల పట్టణంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే పోరాడుతోందని అన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు సాధించిన ఘనత టీయూడబ్ల్యూజే (ఐజేయూ)కే దక్కుతుందన్నారు. శాయంపేట మండలం నుంచి అత్యధిక సభ్యత్వాలు పొందడం హర్షించదగిన విషయమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం, జిల్లా సహాయ కార్యదర్శి గన్ను సంతోశ్, కార్యవర్గ సభ్యులు బాలరాజు, రామారావు, ఓదెలు, రవి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, పాషా, తదితరులు ఉన్నారు.



పరకాల : సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : వేసవి కాలంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ అన్నారు. కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెం, ఉప్పల్ గ్రామాల్లో భవిష్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మండలంలోని గుండేడుకు చెందిన ప్రముఖ వ్యాపారి, సేవా సంస్థ సీఎండీ నాగపురి రాజుగౌడ్‌తో కలిసి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సోమవారం ప్రారంభించారు. అనంతరం రాజుగౌడ్ మాట్లాడుతూ.. వివిధ పనుల నిమిత్తం ప్రయాణించే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ పొరండ్ల కృష్ణప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు లాండిగె లక్ష్మణ్‌రావు, మారపల్లి నవీన్‌కుమార్, ఉపాసి తిరుపతిరావు, ఏలిమి కుమారస్వామి, ఎర్రబెల్లి దేవేందర్ రావు, ఎ ర్రబెల్లి సంపత్‌రావు, సుధాకర్‌తో పాటు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

- రాష్ట్ర నాయకుడు కాళీప్రసాదరావు

దామెర : పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 46వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కాళీప్రసాదరావు హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడారు. వికసిత్ భారత్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ బీజేపీకి అండగా నిలిచి రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి, నాయకులు రతన్‌కుమార్, మధూకర్, సుధాకర్, రమేశ్, చందర్, పరశురాం, రాజు, ముఖేశ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన జక్కుల భిక్షపతి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.



దామెర : నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆరోగ్యమే మహాభాగ్యం

- మాజీ కోఆప్షన్ జుబేదాలాల్

ధర్మసాగర్ : ఆరోగ్యమే మహా భాగ్యమని జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యురాలు జుబేదాలాల్ మహ్మద్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆరోగ్యం సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జుబేదా మాట్లాడుతూ.. మే మాసం రెండోవారం నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మన ఆరోగ్యమే మన ఆస్తిపాస్తులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు ఎం.విజయ, సుజాత, ఆశాలు లక్ష్మి, స్వర్ణలత, రజిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జుబేదా

వేసవి సెలవులను వినియోగించుకోవాలి

- ఎంఈఓ భిక్షపతి

శాయంపేట : రానున్న వేసవి సెలవులను విద్యార్థులు వినియోగించుకోవాలని, బయట తిరగకుండా, విద్యపై దృష్టిసారించాలని ఎంఈఓ భిక్షపతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్లా అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని విద్యార్థులు బయట తిరగవద్దని, ఎండలో తిరిగితే వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఇంట్లో ఉండి చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, సుధాకర్, ప్రవీణ్, ఉమ, స్వప్న, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన కర్ర వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (హన్మకొండ)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
ఎస్. నవీన్ (S.R) : 8919855163 (ఎల్కతుర్తి)